# దివాస్వప్నాలతో ముఖాముఖి

అద్వైతమఠం నిర్మాణంలో ఉన్నప్పుడు, ఆ చిన్న ఇరుకు వీధి ఈనాటి రాజమార్గంగా పరిణతి చెంది, మహానగరపు కాలుష్య మహార్ణవం దిశగా పరుగు లిడే కాలువగా మారుతుందని ఎవరు ఊహించి ఉంటారు?

మఠంలో ఋత్విక్కుల వేదపారాయణా సుమధుర గంభీర అతిలోక శబ్ద తరంగాలు పర్యావరణంలో మిళితమై ఆ ప్రాంతాన్ని పునీతం చేయటం ఏనాడో ముగిసిన చరిత్ర. ముగియనిదల్లా మోటారు వాహనాల నిరంతర భయానక ఘోష, దానితో సంకీర్ణమైన విషవాయు ప్రసరణ. ఇరువైపులా వింత వింత దుకాణాలు, నర్సింగ్‌హోము లనబడే దవాఖానాలు, హోటళ్ళు, బడ్డీకొట్లు, ధూళి ధూసర పరిసరాలను దాటుకుంటూ పరిక్రమించే అశేష జనసందోహం.

ఎందుకీ అశాంతి? ఏమిటీ జగత్తునే కలిచివేసే ఆర్తనాదం? ఈ ఘోషలో సహృదయులకు ఆహ్వాన గీతికలు వినిపించే దెక్కడ?

అధ్యాత్మిక చింతనకేనా మఠంలో అడుగులిడుతున్నదీ భక్తకోటి? కాదు, కాదు. వాళ్ళు భీతావహులు, అధీరులు, ఆర్తులు. భ్రాంతులు. నిజమా? సుబ్రమణికి ఒడలు జలదరించినది. నిస్తేజుడై నిలిచిపోయాడు.

అవును, ఈ సంఘ జీవితంలో యంత్రాలకు, పరిశ్రమలకు ప్రాధాన్యం వచ్చింది కదా! మానవుడి సుఖదుఃఖాల మూలకారణాలు మరి మార్పు చెందవా?

ఇట్లా మనస్సు శంకాపంకిల మవుతున్నా సుబ్బు, లేక మణి అనబడే సుబ్రమణి మఠంతో వెంటనే తెగతెంపులు చేసుకోలేకపోయాడు.

ఏ మానసిక వీచిక తన నా దిక్కుకు తోసిందోగాని, ఒక యాదృచ్ఛిక సంఘటనతో మఠానికీ, తనకూ గాఢ మమతానుబంధం ఏర్పడింది. అప్పట్లో తన నిరంతర ఉద్యోగాన్వేషణ పర్వంలో ఒంటరి నీడగా తిరుగులాడుతూ - ఒక నాడు తన ఇంటర్వ్యూ సమయానికి ఇంకొక గంట వ్యవధి ఉన్నదని మఠంలో శృంగేరిస్వామి అనుగ్రహ ప్రవచనం వినేందుకు గేటు ముందు నిలిచిపోయాడు.

స్వాములవారి క్లుప్త నిర్దిష్ట సందేశం ఐదు నిముషాల్లోనే ముగిసింది. తన జీవన గతికి ఆ సందేశ వాక్యాలను అన్వయం చేసుకునే వ్యవధి కూడా లేదు. వెను వెంటనే ఒక యతీశ్వరుడు ఆదిశంకరులవారి భజగోవింద శ్లోకాల్ని అందు కున్నాడు - ''లోకం శోకహతంచ సమస్తమ్....''

సుపరిచితమైన కంఠం! ఎక్కడో, ఎన్నడో, స్ఫురితకంపిత ఆందోళిత గమకాలతో ఆ పఠనం ఒక శ్రుతి, ఒక గతి, ఒక సౌందర్యం, ఒక ఉల్లాసనం.

అడుగులు చాచి ముమ్ముందుకు పోయాడు. ఆశ్చర్యం! ఆ యతి పూర్వా శ్రమంలో ఎవరో కాదు - తనకు తెలుగు మాష్టారు రామలింగంగారు! మూడేళ్ళు ఆయన పాఠాలు విన్నాడు, ఆయన పద్యాలు విన్నాడు. తన చిన్ననాటి పాఠశా లలో ఏకైక ఉభయ భాషా ప్రవీణుడుగా హృదయోల్లాసంగా పద్యాలాపన చేస్తూ, తెలుగు పాఠం అంటే తెలుగు కవిత్వమే నన్నట్లుగా క్లాసునంతా కలియజుట్టి భైరవరాగంలో అపూర్వ ప్రశాంతి, శ్రీరాగంలో అమలిన ప్రేమ పిల్లల నాస్వా దించమని ఆవేశ సంజనితంగా పాఠాలు బోధించేవాడు; విద్యార్థుల్లో ప్రతిస్పందన కొరవడిందని తోచిందా - ఇక మౌనముద్రే. పాఠం ముగించకుండానే - "శుష్క మానవ మనోగతులన్ కవితల్ వరించునే!'' అనేసి విసవిసా గదినుండి నిష్క్ర మించేవాడు.

కవితా జనని అస్పష్ట సౌందర్యాన్ని - తల్లి అభయహస్త ముద్రలను ఎర గని తనకు ఎరుకపరచిన ప్రేరక గురువు. తన హృదయ పీఠంపై నిలిచి పోయిన వ్యక్తి. కవితా వివశత్వం కల్పించి ఏవేవో పుణ్య తూర్య నినాదాలు విన మని ఈ గర్భస్థ శిశువుకు శాంతి సాయుజ్యాలను దర్శింపజేసిన శిక్షక గురువు.

ఛందస్సు నేర్వాలని ఆయనచుట్టూ ఒక సంధ్యాజీవిగా విద్యార్థిగా ప్రదక్షిణ చేస్తున్న దినాల్లో - "ఎందుకురా, మణీ! నీకి పిచ్చి? కవిత్వం కూడు పెట్టదు. పోయి లెక్కలునేర్చుకో! జీవికకు సాధనలు ఏర్పరచుకో!"అని నిరుత్సాహపరచిన వాడూ తనే కదా? తుదకు తనకు ఛందో సూత్రాలు అబ్బకుండానే విద్యార్థి దశ ముగిసినా, ఆయన తనకు బహూకరించిన కవితా ఖండకావ్యాలను భద్రంగా దాచుకున్నాడు. అందులో ఆయన రచించినవే పది పన్నెండుదాకా ఉన్నవి. ఆయన రూపంలాగానే అవన్నీ సుందర విషాద గేయాలు. గాయాలు, జీవన రాగాలు, ఈనాటి కాషాయంబరాల ప్రథమశ్రుతులు.

* * *

అభేదానందస్వామి చాలాసేపు మాట్లాడలేదు. తను హడావుడిగా ఇంటర్వ్యూ ముగియగానే మఠంవైపు ఉరుకులు పరుగులుగా వచ్చాడు. మఠం వెనుకవైపు గదుల్లో ఆయన చాతుర్మాస్య వ్రతంలో ఉన్నాడని తెలుసుకుని తన రిక్త హృదయ భిక్షా పాత్రను దాచుకుంటూ, ఇన్నేళ్ళకు తన జన్మభూమితో తన చిన్ననాటి జీవనంతో అనుబంధం ఉన్న వ్యక్తి కనిపించగానే ఏదో అనుకంపన గీతం అంతర నాళాలలో అస్పష్ట గాంధారాన్ని పలుకుతూండగా, మఠం బయటి అర్చకుడు చెప్పిన జాగ్రతలు మననం చేసుకుంటూ సాష్టాంగ నమస్కారం చేసి, ముకుళిత హస్తాలతో ఒక జ్ఞాపికకోసం, ఒక స్మృతి సంకేతం కొరకు నిలబడిపోయాడు గదపవారనే.

ఎదురుగా ఒక పరివ్రాజకుడు.

ఒక అపరిచితుడు

ఒక నిలువెత్తు నిశ్శబ్దం.

ఒకనాటి గురువు కాదా?

తనను గుర్తించలేదా?

అప్రశుతా?

సమన్వయ రాగాన్ని తన జన్మభూమి పలికించలేదా ఆయనలో? ఎందుకి ఆందోళన తనలో?

తనిచ్చిన ఖండకావ్య గీతికల నిండా పొంగిపొరలిన ఆశావహ సంకేతాలను, ఈ అనాథ మణిని ప్రజ్వరిల్లజేసిన కవితాభివ్యక్త విశ్వాసాలను, ప్రతీకలను, అద్భుత కవిసమయాల సౌకుమార్య మాలలను - అన్నింటినీ విస్మరించో, లేక శాశ్వతంగా త్యజించో ఈ రామలింగం మాష్టారు - ఈ లోకానికి చెందని కాషాయ వస్త్రాలలో ఏ గుప్త విషాద సంఘటన తనలో దాచుకుని మౌన ముద్ర వహిస్తున్నాడు? ఏ విషపూరిత శస్త్రాఘాతం గతం నుండి వెన్నాడి, పూర్వాశ్రమ సారస్వత కవితా లోకం నుండి తరిమి, విడదీసి, ఆయనను కఠిన జీవనగతుల ఆముష్మిక విశ్వాంతరాలవైపు నెట్టివేసి నిర్దయగా నిష్క్రమించింది? తన బాలక హృదయానికి సృష్టి రహస్యం బోధించిన శబ్దలయ సూత్రాల జీవనాంతర జ్వాలా రవళి మళ్ళీ ఆయన వినిపించదా?

కవిత్వం కూడు పెట్టదని తనను ఆశీర్వదించాడో, శపించాడో - అగమ్య మైన ఆ మార్మిక వాక్యాన్ని తను మనసా, వాచా, కర్మణా ఆచరించాడేమోగాని, 'కవిత్వమొక తీరని దాహం' అని అంతకు ముందెన్నిసార్లనలేదు?

అట్లా ప్రభావితుడై ఆ ఎండ మావుల వెంట క్లైబ్య తరంగాల అటుపోట్ల మధ్య సందేహభావుకుడై, వేదనల నెగళ్ళ తప్త జ్వాలలు వెన్నంటుతూండగా అశ్రాంత శ్రమణుడై ఆనాటి నుంచీ, ఈ మణి - కవితా కన్య కరుణా కటాక్షా లన్వేషిస్తూనే ఉన్నాడు కదా! గణిత శాస్త్రంలో మేధావులైనవారు - ఆ మీమాంస సారాంశాన్ని వడగట్టి గ్రహించి తుదకు వేదాంతులైనారని విన్నాడు. కొందరు సన్యసించి కూడా ఉండవచ్చు.

కానీ ఈయన?

జీవితంలో ముకికితనం, కరకుతనం, పండితాడంబరం దరిజేరకుండా, సాహిత్యమే - అందులో కవితా ధోరణే సమస్తమూ అనుకొని, తను వాడిన కరుణామయ ప్రతీకలతోనే అంచితానంత శాంత సామ్రాజ్యంలోని యోగ ధర్మాన్ని సాహితీ పిపాసువులకు చవి చూపించిన ఈ రామలింగంగారు - పేరు లోనే శివ కేశవ అభేదం ఉంది కదా! - సాహితీ లోకాన్నుంచి ఎందుకు నిష్క్ర మించారు?

సుబ్రమణి అంతరంగం జాలితో, కరుణతో నిండి పొర్లిపోతున్నది. ఒక మానవీయ ఆత్మవేదన. అశ్రుజలం కూడా చెంపల మీద ప్రవహిస్తున్నది. ఆ నిశ్శ బ్దంలో హృదయం బద్దలయ్యేటట్లున్నది. నైరాశ్యపు నూతి లోతుల నుండి తన దైన్యాన్ని, దుస్సహ పరివేదనను,నిరుద్యోగాన్ని. అభద్రతను జనాటవిలో ఒంటరి తనాన్ని - ఆ క్షణంలో ఆయనముందు వెళ్ళబోసుకోవాలని, ఏవో మాటలు కూడబలుక్కుంటున్నా అవి ఎదలోనే మార్మ్రోగుతున్నవి.

"సుబ్రమణీ! సుబ్రమణీ! రేపు నీ గతీ ఇంతే కదా? కవిత్వం మానవుడికి లభించిన అద్భుత వరప్రసాదమని భ్రమించి, ఆరాధిస్తున్న అమాయకుడివా? ఊహాలోకంలో విహరిస్తూ గొప్ప కవులందర్నీ దేవుళ్ళకు ముందే ప్రాతఃస్మరణీ యుల్ని చేసుకొని, దైనందిన జీవన సమస్యల అశాంతి నుండి పరుగిడిపోయి, కవితాత్మ సాక్షాత్కారంతో మోక్షప్రాప్తి, ముక్తి విముక్తి లభిస్తవని నిరీక్షిస్తున్న నిర్భాగ్యుడివోయ్, సుబ్బూ! మణీ! నీదొక సామాన్య నామం. సంధ్యవలే సందేహ

నివి. సందిగ్ధానివి. లోకరీతి తెలియని బలహీన బాలుడివి." ఇదా నిశ్శబ్ద తాత్పర్యం?

మఠం ఆవరణనిండా చీకటి కమ్ముతున్నది. సుబ్రమణి ఒడలు జలదరించినది. అశరీరవాణియా? అంతస్సీమ ఆందోళనా?

తను నిన్న ఇంటర్వ్యూలో సంపాదించిన ఉద్యోగం ఎగ్జిబిషన్‌లో సేల్స్ మేన్ పదవి. తన బి.ఏ. ఆనర్సు లిటరేచర్ డిగ్రీకి కొలమానం. కొత్త ఉద్యోగానికి వేళవుతున్నది, వేచి ఉండలేడు: ఆకలి తీరదు గదా!

''మాష్టారూ!" అని పిలిచి, నాలిక కరుచుకున్నాడు.

నిశ్శబ్దం.

''నన్ను గుర్తుపట్టలేదా? నేను....నేను.... మీ శిష్యుణ్ణి .. సుబ్రమణిని....''

హఠాత్తుగా మఠంలో లైట్లు వెలిగినవి- ఎవరి హస్తమో మెయిన్ స్విచ్చిని పొరబాటున స్పృశించినట్లుగా- గదినిండా మిరుమిట్లు గొలిపే వెలుగు ఆ వెలుగు కిరణాలను చీల్చుకుంటూ శబ్ద తరంగాలు.

"మణివా? కాని, యతులకు, సన్యాసులకు పూర్వాశ్రమ స్మృతుల్ని జ్ఞాతకం చేయకూడదు నాయనా! కూర్చో."

"అంత జ్ఞానం లేదు, స్వామీ!" అని మణి నసిగాడు.

ఇక తను తమాయించుకుని తన ఆవేదనను బహిర్గతం చేయవచ్చా? కన్నీళ్ళు తుడుచుకుంటున్నాడు. స్వాములవారు ఆ అవకాశాన్ని అందుబాటు చేయలేదు.

"అక్షరం పలుకుతున్నదా?"

తన కవితోపాసనా? మరచిపోలేదా? శిష్య వాత్సల్య కరుణారసం ఇంకిపోలేదా?

"ఊహుఁ!"

"అక్షరం పలకటం లేదంటే ఆత్మ దీపం వెలగలేదన్నమాట! వెలుగుతుందిలే! శుభం! మాకు వేళయింది. ఆ మూల పుస్తకాల దస్తరం ఉంది. ఎందుకెక్కడ పడిచిపోయూరో తెలియదు. తీసుకుపో! నీకైనా ఉపయోగపడతవేమో!"

మణి ఇక ఆశ్చర్యపడలేదు. గది మూల సగం దుమ్ముతో దస్త్రం ఉంది. తనకు మొదటి దినం ఉద్యోగం. ఆలస్యం కాకూడదు.

"రేపు వచ్చి తీసుకెళ్తాను. స్వామీ!"

స్వామి అక్కడ లేరు. జపానికి వెడలిపోయారు.

బయట అయ్యప్ప భక్తబృందం సామూహిక భజన వినవస్తున్నది. "సుబ్రహ్మణ్యం, సుబ్రహ్మణ్యం! షణ్ముఖనాథా సుబ్రహ్మణ్యం!"

కిందటి సంవత్సరం తనకు ఏ తాత్కాలిక ఉద్యోగమూ లభించక పస్తులే ప్రత్యామ్నాయంగా తారసపడినప్పుడు సుదర్శనం అనే యువకుడు - తను చేసిన ముప్పై మూడు తాత్కాలికోద్యోగాల్లో ఎప్పుడో సహ బాధితుడుగా ఉన్నవాడు-అయ్యప్ప స్వామి మాల వేసుకొన్న దీక్షతో నల్లగుడ్డలతో హఠాత్తుగా దర్శనమిచ్చాడు. "నువ్వూ దీక్ష పట్టు స్వామీ! అయ్యప్ప కటాక్షంతో నీకూ మంచి ఉద్యోగం వస్తుంది" అని ప్రోత్సహించాడు.

దానిని మించి ఆకలి ప్రోద్బలం. మాల వేసుకున్నాడు. ప్రతి దినమూ ఏదో పందిరికింద ఏ భక్తుడి ఇంట్లోనో సుష్టుగా ఫలహారం, భోజనం. మండలం - నలభై దినాలు ఏకభుక్తమయినా తన ఒడలు సడలిపోలేదు. పైపెచ్చు ఆవేశాల్ని సంయమనం చేసుకునే సత్వగుణపు నిజస్వరూపం కనబడేది. తన మీద తన జాలి కూడా సడలిపోయింది. లోక సత్యాల్ని చూడలేక పారిపోవటంగా గాక వాటి నొక అలోక ప్రదేశం నుండి వీక్షిస్తున్నట్లు భావన కలిగేది. ఆ మండలం దినాల్లోనే తను మొదటిసారిగా రచించిన భజన పాటను రాత్రిం బగళ్ళు మననం చేసుకుంటూ పలికాడు. పదిమందితో కలిసి పాడటం నేర్చుకున్నాడు. అందరు భజన సమాజాల వాళ్లూ ఆ పణితిని వెంటనే పట్టేశారు. 'బాగుంది, బాగుంది, అద్భుతం! ఆధ్యాత్మికం!' అన్నారు. అదే తన ప్రథమ కవితా ప్రతిశ్రుతి. శబరిమలై మాత్రం తను దర్శించలేకపోయాడు. తీవ్రమైన చలిజ్వరంతో పడివున్న తనను ధర్మాసుపత్రిలో ఎవరు పుణ్యంకట్టుకుని చేర్చారో! ఆ పాట మరిచిపోయాడు. మళ్లీ అక్షరం పలకలేదు. పుస్తకం ముట్టలేదు. గతమంతా కలత, శుష్కం, నిష్ఫలం.

*  *  *

ఆ రాత్రి ఎగ్జిబిషన్ ముగిసేసరికి అర్ధరాత్రి దాటింది. తన మూడో అంతస్తు చీకటి గదికి రెండుగంటల ప్రాంతంలో చేరుకున్నాడు. యజమాని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఇప్పించిన రెండు పూరీలు, వేడి తేనీరు.

చలిలో నిద్ర రాకుండా ఈ టీ నీళ్లు. ఈ దుప్పటి పురాతన కాలాలది. పల్చని పొర. భళ్లున తెల్లవారింది.

మరునాడు ఉదయమే హడావుడిగా స్నానం ముగించి, మఠం వైపు సగం పరుగుతీసి, సగం దూరం బస్సులో పయనించి - అభేదానంద స్వామి గది చేరుకున్నాడు. తలుపులు ఓరగా వేసి ఉన్నాయి.

లోపల జలసమాధిలాంటి నిశ్శబ్దం.

తను అక్కడే తచ్చాడటం చూసిన మఠం గుమస్తా సమీపించి, "మీరేనా నిన్న స్వాములవారిని దర్శించింది? లోపల పుస్తకాల కట్ట మీ రొస్తే ఇవ్వ మన్నారు, రండి!" అన్నాడు

"మరి.... స్వామి?"

"వారి చాతుర్మాస్య వ్రతం నిన్నటితో ముగిసింది. వెళ్ళిపోయారు - ఉత్తరాది యాత్రకు కాబోల్ను."

హతాశుడై నిట్టూర్చి తన నిస్పృహల వాయులీనాన్ని పలికించాడు. ''తన జన్మలగ్నం పుడమికి పీడ కల'' అని ఏ కవి అన్నాడో స్మృతికి రాలేదు.

సుబ్రమణి దస్త్రం దుమ్ము దులపకుండానే చంకలో ఇరికించుకున్నాడు. అందులో నన్నయనాటినుండి ఆధునికయుగం వరకూ విస్తరించిన తెలుగు కవితావలోకనం గ్రంథాలు వెయ్యి వత్సరాల భాషా పరిణామాల్ని ఒలికిస్తూ ఉన్నవని ఇంటికి పోయిగాని గ్రహించలేదు.

ఇది వరమా? మరొక రూపంలో శాప పాతమా?

"మణీ! మణీ! ఏమిటీ మార్మికత! ఈ అశ్రుకణాలకోసమా గత రాత్రంతా నీవు వేచి చూసింది?

"సుబ్బూ! సుబ్బూ! నీ కలత నిద్రే నీకు వరం. జారిపో నాయనా! ఆలోచించకు!''

## 2

కలత నిద్రలు తనకు కొత్త అనుభూతులు కావు. కౌమార దశనుండి వాటితో చెలిమి. ఆ చెలిమిలో గతం గుర్తుకు వస్తుంది. తన జీవితంలో సంభవించిన దైవప్రకోపాలన్నీ బయస్కోపు దృశ్యాలుగా, కన్నీళ్ల కాన్కలుగా దర్శనమిస్తాయి.

తల్లి తనకు తెలియదు. తండ్రి ఒడిలో పెరిగాడు. నిరంతరం ఆయన నయనాల్లో చిప్పిలి ఉండే అశ్రుజలాలు. అత్యంత సాదుమదురంగా శ్రవణానందం చేసే ఆయన పిలుపులు - అవి కూడా తన యౌవన సంధిలో కనుమరుగై పోయినప్పుడు, అమ్మమ్మతో ఒక దినమంతా పయనించిన లంఖణాల బోటులో అమ్మ పుట్టింటికి పోయి, అక్కడ తన మేనమామ దైన్యాన్ని తిలకించలేక తిరిగివచ్చినప్పుడు, తన బాగోగులు చూసినవాడు దాయాది పెదనాన్న లింగమూర్తిగారు.

తన తండ్రి మెట్ట వ్యవసాయాన్ని ఆయనే నిర్వహించేవాడు. ఆదాయ వ్యయాలు పొల్లుపోకుండా తనచేతనే వ్రాయించేవాడు. వాళ్ల శ్రీహరితోపాటు తన కన్నీ అమర్చేవాడు. ఆ దాయాది పెత్తల్లీ తనంటే ఏనాడూ విసుగు తెచ్చుకోలేదు. చదువుకు ఆటంకం కలిగించలేదు. కాలేజీలో చేరుతున్న దినాన తండ్రి తనవద్ద దాచిన తులం బంగారపు ఆంజనేయస్వామి బిళ్లను మెడలో వేసి, "శ్రీహరి నీ తమ్ముడు. కష్టపడి చదువుకోండ"ని ఆశీర్వదించాడు.

కాని, దైవప్రకోపంవల్ల హఠాత్తుగా ఎదురయ్యే ఆపదల సంగతి కొద్ది నెలల్లోనే తనకు తెలియవచ్చింది. శ్రీహరి చెడ్డ సావాసాలు పట్టాడు. తను చదువులో, సాహిత్య ఘోషలో మునిగి ఉండి, అతని రహస్య సంచారాల్ని గమనించలేదు. అప్పులు చేసి, క్లాసులు తప్పి ఇంటికి చేరిన శ్రీహరే ఆ ప్రకోపం అని గ్రహించలేదు. దంపతు లిద్దరూ తనను శత్రువుగా పరిగణించినప్పుడు తను నిరపరాధినని నిరూపించుకోలేక ఆపదలో పడ్డాడు. అయినకాడికి తనకు సంక్రమించిన మెట్ట పొలం అమ్మేసుకుని, ఆ ఊరితో తెగతెంపులు చేసుకుని ఎట్లాగో చదువు గట్టెక్కిందనిపించుకున్నాడు.

ఆ శ్రీహరి ఇప్పుడు ప్రయోజకుడైనాడేమో గాని, మానవుడి వియోగ విచార దుఃఖ దైన్యాదులను తన అనుభవంలోకి తెచ్చాడు. పుత్ర మమకారంతో తన మీద అంత మాత్సర్యం పెంచుకున్న ఆ దాయాది పెదనాన్న మీద తన

కెప్పుడూ కోపం రాలేదు. తన కవిత్వపు పిచ్చి అందుకు తోడ్పడిందా? శాంతి లేని తృషితుడుగా త్రిభువనాలు తిరిగినట్లున్నా - కవితారాధన తన నేనాడూ విధ్వంసక విచ్ఛేదక విద్రోహక ఆలోచనలను దరిజేరనీయలేదు. ఇంద్రధనుస్సు లేనిచోట ఇంద్రధనుస్సును సాక్షాత్కరింపజేసింది. రాగం వినిపించనిచోట రాగం వినిపించింది.

కాని - ఈనాడు కాదు, ఈ రేయి కాదు. అదంతా గతం. అనుదిన ఆత్మ వంచనల గతం. కవిత్వ నిత్య సౌందర్యారాధనల మాయాజాలమే ఆ గతం. ఈ రాత్రి తనొక గొప్ప సాహస కృత్యం తలపెట్టాడు. సాహసకృత్యంకాదు - ఒక హత్య. ఒక దుష్ట మానవుడి హత్య. తనను, తనవంటి నిర్భాగ్యులెందరినో మోసం చేస్తున్న వడ్డీ వ్యాపారి 'అమ్మోరి మచ్చల రాజయ్య'ను హత్య చేసి, గతం నుండి విడిపడటం తన తక్షణ కర్తవ్యం. ఆ పిదప ఈ లోకంలో, తనతో తనకిక పని ఉండదు. ఆ కటిక చీకట్లో పద్మశాలీల శ్మశానం గోరీల మధ్య గుంపుగా ఉన్న వేపచెట్ల మానులమాటున ఒక గంటసేపటినుండీ సుబ్రహ్మణి తన మిత్రుడు మల్లేశంకోసం వేచి ఉన్నాడు. అతగాడు రాగానే వీడని తన చిరకాల వేదనలకు స్వస్తి వాక్యం పలకాలి.

కాని, కాబోయే హంతకుడి భాగస్వామి ఇంకా రాలేదు.

## 3

మఠంతో మమతానుబంధం మాసిపోయిందనుకోవటం కేవలం భ్రమేనని కొద్ది దినాల్లోనే గ్రహించాడు మణి. రేకులురాలిన పద్మంలాగా ఆ ప్రాంతంలోనే పరిభ్రమించటం తప్పలేదు. ఐచ్ఛికమో, లేక రామలింగంగారి వాత్సల్య లక్ష్మీ లీలా వచనాలు మళ్లీ వినగలననే ఆశతోనో, తిరిగి ఆ కరుణా శరత్సమయం ఉదయిస్తుందనే నిరీక్షణా మాధుర్య భావనతోనో ఈ సంవత్సరకాలం గడిచింది. ఆ చుట్టుపక్కలే. ఆ చుట్టుపక్కలే అంటే - మఠం ఎదుటి అష్టావక్రుల గల్లీ నుండి రైల్వే బ్రిడ్జి దాటుకుంటూపోతే 'సురుచిర ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ మెస్ ఆంధ్రా పచ్చాళ్ల భోజన సదుపాయం' కొద్ది ఖర్చుతో, చౌక కూరలతో ఒక క్షత్రియ రాజుగారి ప్రాంతీయ నుడికారపు చిరునవ్వుల పిలుపుతో అక్కడే గదా లభించేది!

తను - కవితారాధనా ఉన్మత్తతను స్వగతాల్లో నిరసించుకున్న దినాన హోటలు రాజుగారు - టికెట్టు లేకుండా భోజనానికి వేంచేసినా, "స్తుతమతియైన యాంధ్ర కవి ధూర్జటి పల్కుల కేల గల్గెనో యతులిత మాధురీ మహిమ!" అని అందుకని శ్రీకాళహస్తీశ్వర శతకంలోని మత్తేభ, శార్దూల వృత్తాలను మీసాల గుబుర్ల నుంచి మనోహరంగా వినిపించినప్పుడు ముగ్ధుడైపోలేదా?

రెండు జూనియర్ కాలేజీల అధ్యాపక ఇంటర్వ్యూలకు హాజరవుతూ గడ్డం పెరిగిందని సందేహిస్తూ, జేబులో పావలా బిళ్ళకు ఎవరు క్షవరం చేస్తారని శనిగ్రహపు ఛాయలో నిస్పృహతో నిలిచినప్పుడు - రైలు వంతెన దుమ్ము గోడకానుకుని, ఒక కాలు విరిగిన కంటి అద్దాలతో దూరపు మనిషిని గుర్తించ లేని వృద్ధమంగలి ఐలయ్య తనవద్ద డబ్బు అంతే ఉందని పలికినప్పుడు "నువ్వు ఖామోషుగా కూకో!" అని కసిరి కబుర్లతో, వేదాంత వచనాలతో గడ్డం చేసి పంపిన స్థలాన్ని విస్మరించగలడా?

ఇంటర్వ్యూలో ఒకరు 'నీకు హై సెంకడ్ క్లాసు మార్కులు లేవు కదా?' అని తిరస్కరించినా, ఏదో పార్ట్‌టైమ్ పంతులుగా రోజుకు ఏడు రూపాయల కూలీ నిర్ణయించి, సిలబస్ అయిపోగానే ఆ కూలి పని కూడా తీసివేసిన రోజున ఆ దారినే నడచివస్తూ, నందు మలుపులో గుడ్డి బిచ్చగాడు ధూళిలో స్నానం చేస్తున్న చెట్టు నీడన శ్రద్ధగా బాసిపట్లు పీఠంలో కూర్చుని ఏనాడో మరచిన తన అయ్యప్ప భజన గీతాన్ని అపస్వరాలు లేకుండా ఆలపిస్తుంటే, అశ్రుజలం ఉబికి, జేబులో రూపాయిని దానం చేసి తన జీవనేచ్ఛా నాశనపు నిర్వాణ ధోరణిని అక్కడే గదా తాత్కాలికంగా విసర్జించినది?

ఆ ప్రాంతాల్లోనే ఉత్తర దేశపు కాయస్థ ఉన్నతాధికారి ఇంట్లో పిల్లలకు ఆంగ్ల పాఠాల ట్యూషన్ కొలువు దొరికింది గదా అనే అల్పానందంలో ఓలలాడు తుండగా వాళ్ళకు ఢిల్లీ బదిలీ అయిపోయింది?

ఎన్ని నిరాశా నిస్పృహ వేదనల మధ్య తన కాలం కదలక కదులు తున్నా సుబ్రమణి - జీవిత సంఘటనలకు స్పందించి ఆశ్చర్యపడటం మానలేదు. కౌమారంలో కాకపోయినా, తన పౌగండదశా వయసులో నిత్యకళ్యాణ క్రీడగా ఈ సాహిత్య సంగీతం ఆవరించింది తనను. దుఃఖపరంపరాన్వితుడై ఈ కవితా

ప్రేత కంకణాన్ని అనేకసార్లు అవతలికి విసిరేసినా, అది పునః పునః నాలుగు దినాల్లోనే తన ముంజేతిని అలంకరించి ఉండేది. సృష్టికి ఆదికారణం తుది గమ్యం ప్రేమ తత్వమే అయితే తన ఉనికికి విపులార్థం కవితోపాసనమేనా?

అట్లా ఆ వీధి చివర కర్నూలు శెట్టిగారితో పరిచయమైన రోజున ఆయన వ్యాపారం - పాత పేపర్లు, పుస్తకాలు కొని అమ్మటం అని తెలుసుకొనటంలో ఏదో వింత ఉంది గదా! పేపర్లను కత్తిరించి కవర్లు కట్టడంలో ఆ ఇంటిల్లిపాదికీ బహు నైపుణ్యం ఉన్నా, శెట్టిగారి భార్య పోలీథిన్ సంచుల్లో తూనిక ప్రకారం కొట్టిన కారాన్నీ, పసుపుగుండనూ నింపటం తనకు నేర్పి, తన చేతులు, అరచేతులు ముంజేతులూ మంటకు తాళలేక బొబ్బలు పొక్కడం గ్రహించి పుస్తకాల పనే తన కెందు కప్పగించి, అంతే దినకూలిని నవ్వుకుంటూనే ఇచ్చిం దెందుకు? తనలాంటి శప్త లెవరెవరో అణా బేడకు అమ్ముకొన్న ఆ గ్రంథాల్లో ఎన్ని ఆంధ్ర, ఆంగ్ల, ఉర్దూ కవితా సంచికల్ని తను వేరు చేయలేదు గనుక!

తను మొదటిసారి గది అద్దె నాలుగు నెలలది బాకీ పడ్డప్పుడు, ఇంటి యజమాని సత్తెయ్య అనే సత్యనారాయణ నామధారి, వీరావేశంతో, "నీ సామాన్లను సడక్ మీద విసురుతా" నని గదిలో ప్రవేశించి, అక్కడ అన్ని వందల పుస్తకాలు చూచి విస్తుపోయి "కిరాయి ఇయ్యకపోతే ఎట్టనుకున్నవ్, బాబూ! కొలువు దొరగ్గానే బాకీ కట్టు" అని వెనుదిరిగిపోయిం దెందుకు? ఈ గ్రంథాల్లో అంత ఇంద్రజాలం, మాహాత్మ్యం లేకపోతే ఈ నిరక్షరుడు అట్లా తిరిగి పోయేవాడా?

మల్లేశంతో పరిచయమూ ఆ దారినే. తన జీవన విపంచికతో శ్రుతి కలపక కలవరపడుతున్న ఒక సమయంలో రోజూ బస్సులో తన చంక కింద పుస్తకాల దొంతరను తీక్షణంగా తిలకించే కండక్టరు ఈ మల్లేశం. హసనమందారంగా మొదలైన మారుమాట ఒకనాడు డిపోలో అతని సహపంక్తి భోజనానికి దారి తీసింది. ఆ బస్సు డిపో యువకులు పద్యాల నాటకం కృష్ణరాయబారానికి రిహార్సల్సు వేసుకుంటున్నారు అందులో అతనిది నకులుడి వేషం. రెండు పద్యాలు పలకటంలేదు - నేర్పమన్నాడు. తర్వాత అతని మీద ఏదో ఛార్జి పడినప్పుడు తను అప్లికేషన్ రాసి పెట్టాడు. కరీంనగరు జిల్లాలో

వాళ్ళ పేద సంసారం నిలకడకు తన కలం బలాన్ని చేకూర్చిందని కృతజ్ఞత. పరిచయం స్నేహంగా, ఆ స్నేహంలో ఆర్ద్రత, ఆప్యాయత, పరస్పరం కష్టసుఖాల నెమరువేతగా రూపాంతరం చెందిన తరుణంలో - అత్యవసర పరిస్థితుల్లో తనకు అప్పు పెట్టే అమ్మోరి మచ్చల రాజయ్యతో పరిచయం చేశాడు మల్లేశం. ''మిత్తి బాగా గుంజుతాడు వస్తువు గిరివీ పెడితే రసీదు తీసుకో!'' అని జాగ్రతలూ చెప్పాడు.

రెండోసారి గది అద్దె బాకీ మూడు నెలలకు చేరినప్పుడు గత్యంతరం లేకపోయింది. ఆంజనేయస్వామి బంగారపు బిళ్ళను కుదువబెట్టి అద్దె బాకీ తీర్చి, మిగిలిన పైస లిచ్చిన స్వేచ్ఛతో భరోసాతో కవి సమ్మేళనాలకు, గ్రంథాలయంలో సారస్వత సభలకు హాజరవుతున్నాడు. ఆ పరిచయాలతో తనకో ఆత్మానందం, ఎండిన హృదయోద్యానంలో తిరిగి ఒక పూల మొక్క ఆవిర్భావమో, తనకు మనో స్థైర్యమో - ఏదో మంచి లభించదా?

ఏనాటికైనా ఈ యాత్రికుడు చేరుకునే సుందరనందనోద్యానంలో ప్రశాంత విశ్రాంతి మందిరం కవిత అని కలలు కన్నవాడికి భయానక వేదనా తరంగాలే ఎదురైనవి. ఒక సభలో ఒక అల్ప కవితా సంకలనాన్ని పూలగుత్తుల మధ్య, అసంగత గంభీరోపన్యాసాలతో విక్టోరియా రాణి కాలపు భాషా పదబంధాలతో ఆవిష్కరించటం తిలకించాడు. కాని ఆ కవితల్లో ఆత్మ లేదు. పేలవ పదజాలాలతో వెలగని జ్యోతిని కృతక చిత్రాల పాత దివ్వెతో ప్రాణ ప్రతిష్ఠ చేయాలనే వ్యర్థ ప్రయత్నం తిలకించాడు. వసంతోత్సవంలో పాల్గొనటానికి కొత్త చిగుళ్ళతో, పూరెమ్మలతో సాక్షాత్కరించవలసిన చెట్లు కూలిపోతున్న దృశ్యం అది.

ఇంకొక సాహిత్య సభలో ఆత్మాశ్రయ కవితా రీతుల్ని గురించిన వాగ్వివాదం పశుపాషాణ పైశాచిక ప్రవృత్తుల్ని బహిర్గతం చేసి, పాదరక్షల ప్రయోగాలు కవి సమయాలుగా మారటం చూశాడు. కవిత్వం సమాజానికి చేదివ్వె అని ఇన్నాళ్ళూ భావించిన తన కలలు, వృక్ష జీవితంలోని త్యాగ శీలతను, పక్షి జీవనంలోని భగవద్విశ్వాసాన్ని రాక్షసుడుగా, పరమ నికృష్టస్వార్థ జీవిగా మారిన మానవుడికి ఉద్బోధించగల ఋషిశక్తి ఒక్క సాహిత్యానికే

ఉన్నదని నమ్మిన నమ్మకాలు ఏవీ? అసంఖ్యాక మానవ శరణార్థుల శోక యాత్రగా మారిన ఈ నగరపు జీవయాత్రలో తనిక ఇమడలేడు.

ఆ సమయంలో హఠాత్తుగా నగరంలో కనిపించాడు - నిలకడగా ఏ ఉద్యోగాదాయం లేనివాడికి, ఆనాటి ఎగ్జిబిషన్ ఆసామి తిరిగి ఈ రెండేళ్ళలో కనిపిస్తాడని అతతో కన్నులు కాయలు కాసిందాకా ఎదురు చూసినవాడికి. ఎవరోకాదు, శ్రీహరి. దాయాది పెదనాన్న కొడుకు. ఇది దైవ ప్రకోపం కాదు. దైవలీల అనుకున్నాడు. తన నిర్గమనానికి నాంది అని భావించాడు.

అప్పుడు తను కర్నూలు శెట్టిగారిల్లు మలుపు తిరుగుతున్నాడు. ఒక పక్షం దినాల క్రితమే తన కవితా సంకలనాల గ్రంథాలయాన్ని - దాదాపు నాలుగొందల పుస్తకాల్ని శెట్టిగారికి ఇచ్చి ఎంతో కొంతకు అమ్మిపెట్టమని కోరాడు పాత పుస్తకాలమ్ముకునే సాయిబులు కొందరు చూచి, బేరం కుదరక పెదవి విరిచి వెళ్ళిపోయారనే వార్త విని వెనుదిరిగాడు ఈ పుస్తకాలు ఎంత లేదన్నా ఏడెనిమిది వందల రూపాయలకు అమ్మవచ్చు. పుస్తకం ధర కనీసం రెండు రూపాయలు వేసుకున్నా శెట్టిగారి కమిషన్ వంద రూపాయలు మినహాయించినా, తన ఆంజనేయస్వామి బిళ్ళను తిరిగి గిర్వీనుండి విడిపించుకో వచ్చు. అది తనకు రక్షరేఖ. వీపు తడుతూ అభయం ఇచ్చే అపురూప కానుక. జననీ జనకుల నిత్య నిర్నిక ఆశీర్వచన కవచం.

ఈ మధ్య - తిండి పెట్టని కవితారాధనను విసర్జించిన తర్వాత గ్రంథాలయంలో ఉబుసుపోకకు డిటెక్టివ్ నవలా సాహిత్యం అవిరామంగా చదువుతున్నాడు. ఆంగ్ల నవలలు - అందులో మాస్టర్లనదగిన ప్రౌఢుల గ్రంథాలే ఎక్కువ. ఎడ్గార్ వాలెస్, అగాథా క్రిస్టీ, సర్ ఆర్థర్ కానన్ డయల్ - షెర్లాక్ హోమ్స్, పత్తేదారు కథలు, కాలం ఇట్టే గడిచిపోయేది. ఆకలి అల్లరి పెట్టేదీ కాదు. ఎడ్గార్ వాలెస్ ఒకేసారి పంతొమ్మిది సెక్రటరీలకు వేర్వేరు కథా బాగాల్ని అనాయాసంగా డిక్టేషన్‌గా చెప్పేవాడట! మరి అన్ని అప్పుల్ని తీర్చాలంటే అంత లాఘవమూ ఉండాలి గదా! కాని కవితల్లాగా తృప్తినీ, మనో వికాసాన్నీ ప్రసాదించవు గదా అనుకుంటూండగా ఒక అద్భుతమైన నవల కంటబడింది. ఫయొదోర్ దోస్తొవిస్కీ రచించిన నేరమూ - శిక్షా. క్రైమ్

అండ్ పనిష్మెంట్. ఆ వాక్యాలు ఆవేశ సంజనితాలు. ఆ శైలి ఉద్వేగభరిత మైనది 'గద్యం కవీనాం నికషం వదంతి' అనుకున్నాడు. మానవుడిని నిరంతరంగా వెన్నాడే ఆధ్యాత్మిక, అధిదైవిక, అధిభౌతిక తాపత్రయాలను అనన్య రీతిలో విశ్లేషించిన తాత్విక మహాసముద్ర ఘోషగా ఆ గ్రంథాన్ని ఆసాంతం పఠించలేదు. అందులో యువ నాయకుడు - రోడియన్ రాస్కోల్నికోవ్ అంతః స్సీమల్లో చెలరేగిన విషాదభరిత మానవ ప్రేమ - రెండు హత్యలకు దారితీసింది. కుటుంబ పోషణకు - అందునా సవతి తల్లి బిడ్డల కోసం - పతితగా మారిన ముగ్ధ కన్య సోన్యా మార్మెల దోవాతో జరిగిన భేటీలో ఆ యువకుడు పలికిన కరుణాపూరిత వాక్యాలు - "సోన్యా! నీకు గాదు నేను నమస్కరిస్తున్నది- నీలోని తల్లికి, జననికి!" - అతను చదివిన చివరి మాటలు.

మిగతా నవలా భాగం పూర్తి చేయాలనే ఉద్వేగంతో ఇప్పుడు నడిచి పోతున్నాడు. మధ్యలో శ్రీహరి.

"ఏమిటీ వేషం? ఇంత నల్లబడ్డావ్! చిక్కిపోయావ్!"

సుబ్రమణి నిర్మోహంగా ఒక చిరునవ్వుతో నిలబడిపోయాడు.

"ఇంకా ఆ కోపం పోలేదా? నా వల్లే గదా నీ చిక్కులన్నీ? అమ్మా, నాన్నావాళ్ళు ఎంత ఖిన్నులైపోయారో తెలిస్తే కోపం పెట్టుకోవు. మీ ఇల్లు ముందటి వరండా పడిపోతే నాన్నగారు దగ్గరుండి మరమ్మతులు చేయించారు. మీ నాన్నగారి ఫోటో పెద్దది చేయించి గోడకు తగిలించారు. నువ్వోసారి రావా? మన ఊరంటే ప్రేమ పోయిందా ఏమిటి?"

"నిన్ను చూశాను, శ్రీహరీ! నాకు చాలా ఆనందంగా ఉంది." పాత తరం మనుషుల నిర్మల హృదయాలకు నివాళులర్పిస్తూ మణి నిష్కల్మషంగా మాట్లాడాడు. "మరి నీ వ్యాపారం ఎట్లా ఉంది హరీ?"

"ఓఁ, బ్రహ్మాండంగా ఉంది. అపరాలు కాని కేరళ దాకా ఎగుమతి చేస్తున్నాం. కేరళ మిరియాలు, ఏలకులు దిగుమతి కూడా ప్రారంభించాం. ఒక్క చేతి మీద కష్టంగా ఉంది. మణీ! మరిచేపోయాను - మీ ఇంటిని

రామానుజకూటం వాళ్ళు తీసుకుని కొద్దో, గొప్పో అద్దె ఇస్తున్నారు, మణీ! మీ నాన్నగారు తూము నరసింహదాసుగారివీ, నిష్ఠల ప్రకాశరాయుడిగారివీ కీర్తనలు మన చిన్నతనంలో ఎంత అర్ద్రంగా పాడేవారు- జ్ఞాపకం ఉందా?"

తన జీవన భీతావహ గీతంలో ఇదొక అమృతమయ సందేశం. సుబ్రమణి కళ్ళు చెమ్మగిల్లినవి కన్నీళ్ళు నిండుగా కార్చే ఓపిక లేదు.

శ్రీహరి తన గదికి వచ్చాడు - "ఏమిటీ! పుస్తకాల పురుగువి కదా! ఒక్క పుస్తకం కనబడదూ!" పాత చాప, మాసిన దిండూ చూసి, ఏమీ అనలేక పుస్తకాల ప్రస్తావన తెచ్చాడని తనూ గ్రహించాడు.

"మణీ! నీకు మంచి ఉద్యోగం ఏదీ దొరికినట్లు లేదు. నీ తెలివీ, చదువూ, మంచీ ఈ రోజుల్లో ఎవరి క్కావాలి? డబ్బుండాలి. పలుకుబడి దానంతట అదే వస్తుంది. నా మాట విను! ఏమీ అనుకోవద్దు, మన ఊరు పోదాం. మన వర్తక వాణిజ్యాల్ని వృద్ధి చేసుకుందాం, మణీ!"

బతుకు చెరుగుతున్న నిప్పుల మీద వసంతం చల్లుతున్న శ్రీహరి మాటలకు ఉబికి వస్తున్న అశ్రుజలాన్ని అదిమి పెట్టి "చూద్దాంలే, శ్రీహరీ! నా వంటివాడికి వ్యాపారం వంటబట్టదు. చూద్దాం, చూద్దాం!" అన్నాడు మణి - ఒక్కపూట బంధువుకు అన్నం పెట్టలేని తన అభాగ్యతను మరుగుపరుస్తూ.

శ్రీహరి వెళ్ళిపోయిన తర్వాత గాని దిండుకింద ఐదొందల రూపాయల నోట్లను తను గమనించలేదు. రామానుజకూటం అద్దె డబ్బుటో, లేక తూము నరసింహదాసు కవితాభివ్యక్తి కరుణామయ సంకేతమో!

సుబ్రమణి నేరుగా గ్రంథాలయానికే వెళ్ళాడు. దోస్తొవిస్కీ నవలలో రోడియన్ రాస్కోల్నికావ్ పాత్రలో ముఖ్య ఘట్టం. వడ్డీ వ్యాపారం చేసి సోన్యావంటి అభాగ్యుల్ని పీడిస్తున్న వృద్ధ వనిత హత్యా ఉదంతం ముగిసింది. లోకంలో బలహీనుల్ని ఉద్ధరించేది కవిత్వం కాదు - బహుశః కత్తి ఒక్కటే కాబోలు అనుకుంటూ, పాంటు జేబులో ఐదొందల రూపాయలను తడిమి

చూచుకుంటూ తన ఆంజనేయ రక్షక కవచాన్ని తెచ్చుకునేందుకు వంజర రాజయ్య ఇంటి వైపు చురుకుగా నడిచిపోయాడు.

## 4

మేనంతా నిప్పు కొలిమిలో పతనం కాబోతున్నదనే భ్రమ! జ్వర పీడితుడి అసంగత ప్రలాపం. నిన్న మొన్నటి శ్రీహరి రాకతో తిరిగి పుంజుకున్న మానవ విశ్వాస విస్ఫోటన! సుబ్రమణి మరునాడు స్నానం చేస్తున్న తరుణంలో గాని కనిపెట్టలేదు వడ్డీ వ్యాపారి రాజయ్య మోసం. బిళ్ళ మీద అవే బీజాక్షరాలు, అవే వంపులు, అదే అకారం. కాని, బంగారపు బిళ్ళను మాయం చేసి ఇత్తడి బిళ్ళను చేతిలో పెట్టాడు. "బిడ్డా! వాడు లంగముండకొడుకు! కానరాని మాయలోడు! పసిబిడ్డ ఉగ్గు బర్తనూ కాజేస్తాడు. కట్టమైసమ్మ తల్లి ఎన్నటికి కరుణిస్తదోగానీ పీడి ముకం బొందలగడ్డ కెప్పటి కిడుస్తురో!" అని ఇదివరలో మంగలి ఐలయ్య అన్న మాటలు మననం చేసుకుంటూ, మల్లేశం బస్సు ఏ రూటు నడుస్తున్నదో జ్ఞాపకం తెచ్చుకుని కట్టమైసమ్మ గుడి ఎదుటి స్టాండ్‌లో నిలబడిపోయాడు.

డిపో క్యాంటీన్ మురికి బల్లల మీద చాయ్ తాగుతూ మిత్రు లిద్దరూ అమ్మోరి మచ్చల రాజయ్యవంటి చీడ చెదపురుగులకు మరణ దండన మొక్కటే తగిన శాస్తి అన్ని నిర్ణయానికి వచ్చారు. రాస్కోల్నికావ్ వేదాంతం మల్లేశానికి ఎంతగానో నచ్చింది హత్యాస్థలాన్ని కూడా ఎన్నుకున్నారు.

శ్మశానపు - చెట్ల గుబురు. కాళరాత్రి. ఎదురుగా రాజయ్య మునిసిపాలిటీ స్థలాన్ని కబ్జా చేసి కట్టిన పాప పంకిలపు ఇల్లు. మల్లేశం సంచిలో దాచి రాస్కోల్నికావ్ ఆయుధం - గొడ్డలిని రహస్యంగా తెస్తాడు. కాలకృత్యానికి అపరాత్రివేళ రాజయ్య శ్మశానం వైపు రాగానే ఖతం! 'ది సీజ్ ఇర్రెసిస్టిబుల్ హంగర్ ఫర్ జస్టిస్!' అని ప్రవక్తలాగా చివరి మాట అని, మిత్రుడి వాగ్దానం తీసుకుని మణి తమస్సు కోసం ఎదురు చూస్తూ తిరిగి గ్రంథాలయం ఆవరణ లోకి జొరబడ్డాడు. అతని మస్తిష్కంలోకి జొరబడనిది ఒక దైవ ప్రకోపం. మల్లేశం ఇంటికి చేరగానే తండ్రి చనిపోయాడనే కరీంనగరం జిల్లా నుండి తంతి వార్త!

* * *

పది గంటలు దాటినా మల్లేశం జాడలేదు. పిరికితనంతో సడలిపోయాడా? తన చెల్లి పెళ్ళికి చేసిన వెయ్యి రూపాయల అప్పుకు నాల్గింతలు రాబట్టిన రాజయ్యగాడి రాతిగుండె విషయం మరచిపోయాడా? కీచురాళ్ళ రవళిలో సుబ్రమణి తన చెవులను దశదిశలకూ పరిచి వేచి చూస్తున్నాడు. కాని, పత్తా లేడు మల్లేశం.

ఇంతలోనే ఆ చీకట్లోకి తనవంటివాడింకెవడో ప్రవేశించి నాలుగు సెకండ్లాగి ఈల వేశాడు. యాభైగజాల దూరంలో ఉన్న రాజయ్య ఇంటి ఆవరణలో ఒక చిరుదీపం కనిపించింది. చేతిలో ఒక సందుకాయ పెట్టె పట్టుకుని, ఒక ఇరవై ఏళ్ళనిపించే వయసు పిల్ల కదిలి రావటం గమనించాడు అ యువకుడూ, యువతి రహస్యంగా ఏమి కలబలుక్కున్నారో, శ్మశానం వెనుక బాటలోపడి అదృశ్యమైపోవటమూ చూచాడు మణి. విధి లేక దూరాన్నుంచి వినవచ్చిన పోలీసు గస్తీ బిగిల్స్‌కు వ్యతిరేక దిశలో నడుచుకుంటూ తనూ ఇంటి దారి పడ్డాడు. ఆశ్చర్యకరంగా అతనికి వెంటనే నిదుర వచ్చింది. ఇన్నాళ్ళకు కలత లేని కమనీయ నిద్ర!

# 5

అంతవరకూ మౌనంగా కథ విన్న గురుమూర్తి "ప్చ్!" అన్నాడు. "నో పొయటిక్ జస్టిస్ ఇన్ దిస్ స్టోరీ!" అని తేల్చేశాడు.

కథకుడికి ఒళ్లు మండింది. "తెలుగులో అఘోరించు! పొయటిక్ జస్టిస్ అంటే కవితాత్మక న్యాయం అనే కదా నీ మనోభావం! ఆంధ్రదేశపు అపరాలు, కేరళ మిరియాల వ్యాపార సంస్థలో సుబ్రమణి గుమస్తాగా చేరి లక్షలాది అకవితాత్ముల చచ్చు సమాజంలో సభ్యుడై పోతాడనేగా నీ దుగ్ధ? కాదు. అసాంతం విను!" అన్నాడు.

* * *

సుబ్రమణి జ్వరం అనిపిస్తున్నా చన్నీళ్ళ స్నానం చేసి గదిలోకి రాగానే ఎదురుగా కర్నూలు శెట్టి పెద్దకొడుకు నిలిచి ఉన్నాడు. "నాయన జిరుగురుగా రమ్మన్నాడు. పుస్తకాలకు మంచి బేరం వచ్చిందంట!"

మణి తడిఒంటి మీదనే చొక్కా తగిలించుకున్నాడు. లుంగీ విప్పి, పైజమా వేశాడు. క్రాపు దువ్వుకోలేదు. ''పద!'' అన్నాడు.

చిన్నశెట్టి మణి స్ఫురద్రూపం చూస్తూ, ''జుట్టు దువ్వుకోకపోయినా అందంగానే ఉంటాడు'' అని మనసులో సినిమా సంభాషణ ఒకటి వేసుకున్నాడు.

శెట్టిగారిల్లింకా నిశ్శబ్దంగానే ఉంది. ఆయన పక్కన స్టూలు బల్ల మీద కూర్చుని ఉన్న యువతిని మణి పరికించి చూడనుకూడా లేదు.

''ఏమండీ! ఇంత మంచి పుస్తకాన్ని ఎందుకమ్మేస్తున్నారు? ఎక్కడా లభించని సంపుటాలు మీరు మార్జిన్లలో రాసుకున్న కామెంటరీలు. చాలా పెద్ద విచారద్రోహమండీ!''

అప్పుడు చూశాడు ఆ యువతివంక. పెద్దనగారి వరూధిని వర్ణన - ''విద్యుల్లతా విగ్రహన్, శత పత్రేక్షణ, చంచరీక చికురన్ చంద్రాస్య....''

మణికి నోట మాట రాలేదు.

''ఐ యామ్ సారీ, అండీ! నా పేరు కవిత. మా నాన్నగారు రామశేష గారు. విని ఉంటారేమో, మా నాన్నగారికి గ్రంథ ప్రచురణ సంస్థ ఉంది - కణ్వాస గ్రంథమాల. మాంచి కవితా సంకలనాలు, కథానికా సంపుటాలు వేస్తూంటారు. ఈ సంవత్సరంలో అన్నీ అధునిక కవితా సంకలనాల్ని వేస్తారు. మొన్ననే కొత్త లెటర్ ప్రెస్ తెప్పించాం. మీ రేమైనా అనండి - లెటర్ ప్రెస్‌లో వచ్చే అచ్చు అందం మీ ఆఫ్‌సెట్‌లో రాదండీ! గురువారంనాడు స్వామి అఖేదానంద మా ప్రెస్సుకు ప్రారంభోత్సవం చేస్తారు. మీకు తెలుసో, తెలీదో - ఈ స్వాములవారు ఒకప్పుడు చాలా గొప్ప కవిట!"

అప్పటికీ మణి తలదిమ్ము వదలలేదు. కాని, కళ్లు మసకబారుతున్నది అశ్రుజలక్రీడ వల్ల అని గ్రహింపవుతున్నది.

మళ్లీ కవిత చెప్పుకుపోతున్నది:

"శెట్టిగారు చెప్పారు- మీకింకా మంచి ఉద్యోగం దొరకలేదని. మా నాన్నగారు పబ్లికేషన్స్ సెక్షన్‌లో సమర్థుడైన సంపాదకుడి కోసం అన్వేషిస్తున్నారు."

ఎట్టకేలకు "అట్లాగా?" అనగలిగాడు.

"ఇంకో విషయం, మాస్టారూ! క్షమించాలి, సార్! నేను 'ఆధునిక కవితలో సాంప్రదాయ విలక్షణాల'ను గురించిన పరిశోధన చేస్తున్నాను మా గైడ్ - శివానందంగారికి అమెరికాలో ఒక అర్నెళ్ళ ఉపన్యాసాల ఉద్యోగం తగిలి వెళ్ళిపోయారు. రెండెళ్ళనుంచీ ఇది ఒక పట్టానికి రాలేదు. మీరు శ్రమ అనుకోకుండా నాకు కొంచెం దారి చూపిస్తే వచ్చే సంవత్సరానికి, నేనూ డాక్టరైపో కూర్చుంటాను. నాకు తెలుసు - మీది లిటరేచర్ ఆనర్స్. మీరు ట్యూషన్ చెప్పిన కాయస్థుల పిల్ల అర్పిత నా ఫ్రెండే!''

''అట్లాగా?''

''ఈ పుస్తకా లెవరికీ అమ్మవద్దు. నాన్నగారు వచ్చి మాట్లాడతారు. అమృతం కురిసిన రాత్రిలో - మీకు అడ్వాన్స్‌గా నాన్నగా రిచ్చిన కవరుంది. క్షమించాలి, చాలా తొందరగా మాట్లాడానేమో! రేపు నాన్నగారు కారు పంపిస్తారు."

ఆ 'అభిజ్ఞాన శాకుంతలం' అదృశ్యమైపోయింది ఆ 'వెన్నెల్లో ఆడు కున్న ఆడపిల్ల' వెడలిపోయింది.

సుబ్రమణి మొగం మీద చేతులు అదిమిపట్టి ఏడుస్తుండగా, శెట్టి దంప తులు తొంగి చూచి గాబరా పడుతున్నారు. ''ఏమాయె నాయనా, ఏమాయె! ఆ పిల్ల చాలా పెద్దింటి తల్లి. మంచి పిల్ల, బాబూ!''

''ఏం కాలేదు శెట్టిగారూ! ఒక పద్యం గుర్తు కొచ్చింది. దుఃఖం వచ్చింది. ఆ పద్యం చదవనా?

''నీ రూపం కనరానందున
నా గుహలో
కుటిలో
చీకటిలో
ఒక్కడనై క్రుమ్కిన రోజులు లేవా?''

సుబ్రమణి చక్కగా ఆలపించిన ఆ చరణ రహస్యం శెట్టిగారికి అర్థం అయిందో, లేదో గాని అతనూ ఏడవటం ప్రారంభించాడు. అతన్ని చూసి ఆయన భార్యా ఇంటిల్లిపాదీ కేకలు వేయసాగారు.

* * *

ఆ మర్నాడే పోలీసులు సుబ్రమణిని ఠాణాకు పిల్చుకుపోయారు. ఒక సిందుకాయ పెట్టెలో తన పేరూ చిరునామా వ్రాసివున్న పల్చని ఎర్రకాగితంలో వున్న బీజాక్షరాల ఆంజనేయ పతకాన్ని గుర్తుపట్టమన్నారు. ఆ రోజు రాత్రి సొమ్ముల పెట్టెతో పరారవుతున్న రాజయ్య కూతుర్నీ ఆమె ప్రియుణ్ణీ పోలీసులు నిర్బంధించిన ఫలితం అది.

*        *        *

గురువారం ఉదయం వేద పారాయణల మధ్య కణ్వాస గ్రంథమాల వారి కొత్త అచ్చు యంత్రానికి ప్రారంభోత్సవం చేసిన రామలింగం మాస్టారు అనబడే అభేదానందస్వామికి ప్రణామం చేసి, పూలమాల వేసి సుబ్రమణి - తన కథంతా చెప్పాలని వేచి ఉన్నాడు.

(తెలుగు కవులందరికీ నివాళిగా వ్రాసిన ఈ కథలో ఎవరెవరి కవి సమయాలు, అలంకారాలు అది అంత్యప్రాసలున్నాయో వారందర్నీ క్షమించ మని వేడుకొంటున్నాను.)